# గూటికి చేరిన గువ్వలు

తాటికోల పద్మావతి

సాంస్కృతిక సంగీత కళాశాలలో సాయంత్రం ఆరుగంటలకు నాట్యప్రదర్శన మొదలైంది. ముందుగా చిన్నారులు లలిత సంగీతం పాడారు అప్పటివరకు పలుచగా ఉన్న జనం విజ్ఞానమందిరంలో గౌతమి నాట్యానికి హాలంతా కిటకిటలాడిపోతున్నది. పిల్లలు పెద్దలే కాక ఉర్రూతలూగే యువతరం. అంతా ఒక్కచోట చేరి ఆమె నాట్యాన్ని చూడటానికి తహతహలాడిపోతున్నారు. అతిథులుగా వచ్చిన ప్రముఖులంతా ముందు వరసలో కూర్చున్నారు.

గౌతమి స్టేజిమీదకు రాగానే ఈలలు చప్పట్లతో మారుమ్రోగింది. ఎర్రరటి అంచున్న పసుపు పచ్చని పట్టుచీరలో ఒంటినిండా ఆభరణాలతో వయ్యారంగా ఒంపుసొంపులతో నడిచివస్తూ గోరింటాకు పెట్టుకున్న రెండు చేతుల దోసిలినిండా గులాబీరేకులను నటరాజు పాదాలకు సమర్పించి దైవాన్ని, విద్య నేర్పిన గురువుల్ని తలచుకొని నాట్యం మొదలుపెట్టింది. ఆ వయ్యారి నడకల హంస భంగిమలు, నెమలి పురివిప్పి నాట్యం చేస్తున్నట్టుంటే చూస్తున్న ప్రేక్షకులకు కళ్ళు తిప్పుకోకుండా ఏకాగ్రతలో లీనమైపోయారు.

ఈ అమ్మాయిని ఎవరు చేసుకొంటారోగాని అదృష్టవంతులు. ఆ అందం చూస్తుంటే వయసుపైబడిన వారినే మత్తెక్కిస్తున్నది. ఇంక కుర్రకారు సంగతి చెప్పనవసరం లేదు. ఎలాగైనా గౌతమి మనసు సాధ్యమైనంతవరకు సంపాదించాలని కలలుకంటున్నారు.

శశికాంత్‌కి ఆరాత్రి నిద్రకరువైంది. సిగరెట్‌మీద సిగరెట్ కాలుస్తున్నాడు. కళ్ళు మూసినా తెరిచినా గౌతమి రూపం కనిపిస్తుంది. ఈమధ్య ఉద్యోగ రీత్యా గుంటూరు వచ్చి నాలుగు నెలలైంది. రూం అద్దెకి తీసుకొని ఉంటున్నాడు. ఎలాగైనా ఆమె అడ్రస్ సంపాదించాలి అనుకొన్నాడు.

మర్నాడు ఆఫీసులో మిత్రుడి ద్వారా ఆమె ఎక్కడ వుండేది తెలుసుకొన్నాడు. సాయంత్రం ఐదుగంటలు కాగానే సంగీత కళాశాలకు వెళ్ళాడు. అక్కడ గౌతమి కొంతమంది చిన్నపిల్లలకు సంగీతం నేర్పుతున్నది. ఆఫీసురూంలో కూర్చుని ఎదురుచూశాడు. మేడమ్ మీకోసం ఎవరో వచ్చారనగానే వెళ్ళి చూసింది. ఎప్పుడూ చూసినట్లు లేదు. పరిచయం లేని వ్యక్తి అయినా నమస్కారం చేసింది.

చిరునవ్వు నవ్వుతూ మీతో కొంచెం మాట్లాడాలి అన్నాడు. చెప్పండి అంది. ఇక్కడ కాదు అలా ఎక్కడికైనా వెళ్ళి మాట్లాడుకొందాం అన్నాడు. పరిచయంలేని వ్యక్తి వెంట వెళ్ళడం తప్పని తెలిసినా వెళ్ళక తప్పలేదు.

అలా నడుచుకొంటూ రెస్టారెంటులోకి వెళ్ళి కూర్చున్నారు. ఏం తీసుకొంటారు కాఫీ, టీ, కూల్‌డ్రింక్ మీ ఇష్టం.

నాకేమీ వద్దు. మీరెందుకు వచ్చారో దయచేసి చెప్పండి. నేను త్వరగా వెళ్ళాలి. మామూలు పంజాబీ డ్రెస్‌లో ఉంది. ఎవరైనా చూస్తే పలుకరిస్తారని భయం.

ముందు కూల్‌డ్రింక్ తీసుకోండి. కూల్‌గా మాట్లాడు కొందాం అన్నాడు. ఆ మాట్లాడబోయేది ఏమిటన్నట్లు ఆశ్చర్యంగా చూసింది.

“నిన్న మీ నాట్యప్రదర్శన చూశాను. అద్భుతంగా ఉంది. ఇంత అందమైన మీ సౌందర్యాన్ని చూసి ముగ్ధులవ్వని వారుండరు. నిజంగా మిమ్మల్ని అభినందిస్తున్నాను. తొలిచూపులోనే నా మనసు పారేసుకొన్నాను. మిమ్మల్ని ప్రేమిస్తున్నాను అనేకంటే మీరు నా భార్యగా రావాలని ఆశపడుతున్నాను.

మీకిష్టమైతే మీ పెద్దవాళ్ళతో మాట్లాడుతాను. నేను మా తల్లిదండ్రులకు ఒక్కడినే కొడుకుని. పొలాలు, ఇళ్ళు ఉన్నాయి. నేను కావాలనుకొంటే ఎంత కట్నమైనా ఇచ్చి నన్ను చేసుకోవాలనుకొనే వాళ్ళు చాలామంది ఉన్నారు. నేను మాత్రం మిమ్మల్నే చేసుకోవాలనుకొంటున్నా. బ్యాంక్ ఆఫీసర్‌గా ఈ ఊరొచ్చి నాలుగు

నెలలయింది.

ఒక్కరోజు చూడగానే నన్ను ప్రేమించానని పెళ్ళి చేసుకొంటానని అంటున్నారు. నేను అందంగా ఉన్నానని అందరూ అంటారు. మీలాగే ఎంతో మంది పెళ్ళి చేసు కొంటానంటూ వచ్చారు. పెళ్ళయినాక నాట్యం మానేయాలన్నారు. ఇపుడు నా నాట్యాన్ని చూసి ఇష్టపడి చేసుకొని, పెళ్ళయినాక మానేయాలనుకోవటం నా స్వేచ్ఛను బంధించినట్లే, పెళ్ళిపేరుతో నన్ను చేసుకొని అధికారం చెలాయించి నా కళను కళంకితం చేయటం నాకిష్టం లేదు. పెళ్ళయినా మానుకుంటానుగాని నా నాట్యాన్ని మాత్రం వదులుకోలేను.

మిమ్మల్ని నేను ఎప్ప టికీ నాట్యం చేయవద్దని చెప్పను. మీఇష్టం. కళా పోషకుడిని కళను గౌర విస్తానుగాని కించపరచను. మన పెళ్ళికి, నాట్యానికి ఎటువంటి అడ్డంకులుం డవు. మీ నిర్ణయాన్ని ఇపుడే చెప్పమని బలవం తం చేయటం లేదు. నాలుగురోజులు బాగా ఆలోచించుకొని తెలియచేయండి. ఇదగో నా విజిటింగ్ కార్డు అంటూ ఫోన్ నెంబరున్న కార్డు తీసిచ్చాడు.

గౌతమి బయలుదేరింది. ఒక్కతే ఆటోలో వెళ్ళిపోయింది. ఇంటికి వెళ్ళిందన్న మాటేగాని మనసులో విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పటానికి ధైర్యం చాలలేదు. గౌతమికి చిన్నప్పటినుంచి నాట్యమంటే ఇష్టం డిగ్రీ పూర్తి చేస్తూనే నాట్యం నేర్చుకొంది. పదిమందిలో అలా ప్రదర్శనలివ్వటం తల్లి దండ్రులకు ఇష్టంలేక పోయినా ఒప్పించింది.

మన ఇంటావంటా ఇలాంటి అలవాట్లు పద్ధ తులు, లేవన్నారు. స్టేజీ మీద గజ్జెకట్టి నాట్యం చేయ టం పరువు ప్రతిష్టలు పోతాయన్నారు. ఇవన్నీ లెక్కచేయలేదు గౌతమి. తనకిష్టమైన పనిని ఎవరు కాదన్నా సహించలేదు, తన ఆశయాన్ని సాధించుకోవ టమే ఆమె ధ్యేయం.

## శిలల సరిగమలు

సచీంద్ర దేవాలయంలోని శిల్పాలుగా
చెక్కబడిన రాతి స్తంభాలు, సజీవ సంగీత
కళాకారుల వలె
సరిగమలు పాడుతాయట!
జీవం వుండి కూడా సంగీతం పాడలేను నేను!
మనిషి చెక్కిన రాతి స్తంభాలే, సరిగమలు
పాడుతూంటే,
బ్రహ్మచే చెక్కబడిన నేను సంగీతం
పాడలేక పోవడం, సిగ్గుచేటనిపించింది!
నా చుట్టూ వున్నవారు నా మనస్సుని రాయిచేశారు.
మొత్తం మనిషినే రాయినైపోతే, సరిగమలు
పాడొచ్చని నా మనస్సులో ఓ
ఆలోచన తళుక్కుమంది!
అందుకే ఓ శిలలా మారిపోయాను!

**భమిడిపాటి సోమయాజి**

నాలుగు రోజులు గడిచినా ఎటువంటి రిప్లైయి రాలేదు గౌతమి నుంచి ఈ నాలుగురోజులు నాలుగు యుగాలుగా గడిపాడు శశికాంత్. స్వయంగా ఇంటికి వెళ్ళి గౌతమి తల్లి దండ్రులతో మాట్లాడాడు. పైసా కట్నం వద్దన్నాడు. ఒకే కులం పెళ్ళికి అభ్యంతరం ఎందుకన్నాడు.

మధ్యతరగతి కుటుంబం కావటంతో గౌతమి పెళ్ళి తల్లిదండ్రులకు భారంగా అనిపించింది. ఇటువంటి సమయంలో కట్నం లేకుండా పెళ్ళి చేసు కొంటానంటూ వస్తే కాదనటం తెలివితక్కువ తనం అనిపిస్తుంది.

బ్యాంక్ ఆఫీసర్ అల్లుడుగా రావటం అంటే మాటలా! గౌతమి పెళ్ళి ఎటువంటి అభ్యంతరం పెట్టలేదు.

పెద్దల ఆశీర్వచనాలతో పెళ్ళిమంటపంలో బాజా భజంత్రీలు మోగుతుంటే గౌతమి మెడలో మూడు ముళ్ళు వేశాడు శశికాంత్. ఉన్నదాంట్లోనే అన్నీ ఘనంగా జరిపించి అత్తవారింటికి పంపారు. పెళ్ళయిన నెల రోజులకే శశికాంత్‌ని తిరిగి హైద్రాబాద్‌కు ట్రాన్స్‌ఫర్ చేశారు. తల్లిదండ్రులతోనే కలిసి ఉంటున్నారు.

అందమైన భార్య. సాయంకాలం భర్త ఇంటికి రాగానే నవ్వుతూ ఎదురెళ్ళి మంచినీళ్ళగ్లాసు అందించటం, కాఫీ టిఫిన్ పెట్టడం, కాసేపు సరదాగా అలా ముస్తాబై సరదాగా బయటికెళ్ళేవారు. అందమైన జంటదాంపత్యం ఆరు నెలలు అనురాగంగా సాగిపోయింది.

ఆఫీసునుంచి వస్తూనే గౌతమి నా బట్టలు త్వరగా సర్దాలి. నేను బెంగుళూరు క్యాంపు వెళ్ళాలి. రావటానికి వారం పదిరోజులు పట్టవచ్చన్నాడు.

వారంరోజులు భర్తకి దూరంగా ఉండవలసి వచ్చినందుకు మనసులో బాధగానే ఉన్నా, ఆ బాదను మనసులోనే దిగమింగుకొని మామూలుగానే సూట్‌కేస్ సర్దింది.

మౌనంగా ఉన్న భార్యను గమనిస్తూనే ఉన్నాడు

శశికాంత్. వారం అంటే ఎంత ఇట్టే గడిచిపోతాయి. ఆఫీసు పనైపోగానే రెక్కలు కట్టుకుని వాలతాను నీ ముందు. తిరిగి వచ్చేవరకూ ఒక తీపి జ్ఞాపకం అంటూ రెండు చేతులమధ్య బంధించి ఉక్కిరిబిక్కిరి చేశాడు.

అబ్బదలండి అత్తగారు చూస్తే బాగుండదంటూ చేతులు విడిపించుకొని దూరంగా జరిగింది. వెళ్ళలేక వెళ్ళాడు శశికాంత్!

గౌతమిగారున్నారా అంటూ కొంతమంది ఆడామగా కలిసి వచ్చారు. అత్తగారు శ్యామలాదేవి వారిని సాదరంగా ఆహ్వానించి కూర్చోమంది. ఇంతలో లోలపనుంచి గౌతమి కూడా వచ్చింది.

రవీంద్రభారతిలో ఈ నెల పదో తేదీన నాట్యప్రదర్శన ఏర్పాటు చేస్తున్నాం. మీలాంటి కళాకారులను ఆహ్వానించి వచ్చిన కలెక్షన్‌తో ఒక సంగీత కళాశాలకు భవనం నిర్మించాలని మా ఉద్దేశ్యం. మీలాంటివారు తప్పక ఆదరిస్తారని మా నమ్మకం. మీపేరు కూడా పాంప్లెట్‌లో వేయించాలి గదా మిమ్మల్ని అడగటానికి వచ్చామన్నారు.

సారీ! మావారు ఊర్లో లేరండి... ఆయన్ని అడగందే నేనేమీ చేయలేనంది.

మీవారి ఫోన్ నెంబరుంటే ఇవ్వండి మేం మాట్లాడుతాం అన్నారు. ఇవ్వమ్మా! తప్పేముంది. వచ్చిన కళను పదిమందికి వినియోగపడేలా ఉండాలి కాని, దాసుకొంటే ఏంవస్తుంది అంది అత్తగారు.

భర్తకు ఫోన్ చేసింది గౌతమి. సిగ్నల్స్ లేకనో ఏమో, ఫోన్ పని చేయటంలేదు.

అబ్బాయికి నేను చెబుతాలే ఒప్పుకోమంది అత్తగారు. ఎక్కువ వ్యవధికూడా లేదన్నారు వచ్చిన పెద్ద మనుషులు. గౌతమి తన ప్రోగ్రాం ఇవ్వడానికి ఒప్పుకుంది.

రెండురోజుల తర్వాత శశికాంత్ ఫోన్ చేసినపుడు గౌతమి తన ప్రోగామ్ గురించి చెప్పింది. పెళ్ళయిన తర్వాత ఇలాంటి ప్రోగామ్ లివ్వడం నాకిష్టంలేదు. నాకు తెలియకుండా ఎందుకు ఒప్పుకొన్నావన్నాడు. మీకు చెప్పాలని ఫోన్ చేశానని చెప్పినా నమ్మలేదు. నేను ఊర్లో లేనప్పుడు ఇలాంటివి ఎందుకు ఒప్పుకొన్నావు. నాకు తెలీకుండా ఇంకెపుడూ ఇలాంటి పని చెయద్దంటూ హెచ్చరించాడు.

తన భర్తేనా ఇలా మాట్లాడేది అనుకొంది. అత్తగారు చెబితేనే సరేనంది. తను పదిమందిలోకి వెళ్ళటం ఇష్టం లేదా. ఆరోజు అంతమందిలో నాట్యం చేయబట్టేగదా తను చూసి ఇష్టపడి పెళ్ళిచేసుకొనోనది. పెళ్ళిచేసుకొంటే నాట్యం చేయకూడదని రూలేమైనా ఉందా! భర్త మాట్లాడిన తీరు తలచుకొంటనే బాధగా ఉంది.

ఆరోజు ఆదివారం కావటంతో రవీంద్రభారతి ప్రేక్షకులతో కిక్కిరిసిపోయింది. తెర తొలగగానే నాట్యమయూరి గౌతమి ప్రదర్శన అనగానే హాలంగా నిశ్శబ్దమైపోయింది. ఊర్వశి అందాలను తిలకిస్తున్నట్లుగా తన్మయులైపోయిరు. వరుసగా రెండు మూడు ప్రదర్శనలు జరిగినాయి.

గౌతమి పాటలు కూడా పాడుతుందని తెలుసు. ఎవరో ఒక పెద్దాయని అన్నమయ్య కీర్తన పాడమంటే పాడింది. అద్భుతం అంటూ చప్పట్లు మోగాయి.

## నేనీ భావకవితనై!

నేలతల్లి చావడిలో
చదువులమ్మ ఒడిలో
అక్షరాల బడిలో
నీ కటాక్షాన్ని కోరుకుంటూ
గవాక్షాల్ని మూసుకుంటూ
నక్షత్రాల్ని చూసుకుంటూ
అక్షరాల్ని ఏరుకుంటూ
మమేకమైన భావాల్ని తలచుకుంటూ
ఆరుగాలపు తడిలో
విత్తునై! మొలకనై! మొక్కనై!
పువ్వునై! కాయనై! కడకు
మహా వృక్షాన్నై!
శారదమ్మ చరణాల మువ్వనై
నే పులకిస్తూ
సతతమూనే పినాకపాణినై
స్వరఝరినే పలికిస్తూ
ప్రతిధ్వనికి నే చలిస్తూ
ఫలిస్తూ! తలుస్తూ! మురుస్తూ!
కడకు నేనీ శృతిలయలో జ్వలిస్తూ!
నిలిచిపోనా నేనీ భావ కవితనై!

**దోసపాటి సత్యనారాయణమూర్తి**

ఆయన వెయ్యి నూటపదహార్లు ఇచ్చారు. బిట్‌లమీద పాటల పేర్లు రాసి పంపటం మొదలుపెట్టారు. పాడిన ప్రతిపాటకు నజరానా ఇస్తూ వస్తున్నారు.

చివరగా మొక్కజొన్న తోటలో ముసిరిన చీకట్లలో అనేపాట పాడినందుకు రెండువేలు బహుమతిగా ఇచ్చారు. ఆ డబ్బంతా భవన నిర్మాణానికే అందచేసింది. చాలా పొద్దుపోవటంతో గౌతమిని కార్లో ఇంటివరకూ దింపి వెళ్ళారు. అత్తగారికి జ్వరంగా ఉండటంవల్ల ఆమె రాలేక పోయారు.

పదిరోజుల తర్వాత క్యాంపు నుండి తిరిగి వచ్చాడు శశికాంత్. కాఫీ, మంచినీళ్ళు అందించినా ముభావంగానే వున్నాడు. వెళ్ళేటపుడున్న ప్రేమ వచ్చినపుడు కనిపించ లేదు. స్నానం చేసి భోజనం చేసి పడుకొన్నాడు.

గౌతమి పలుకరించింది. నేనేం తప్పు చేశానని ఇలా ప్రవర్తిస్తున్నారు. నేను నాట్యం చేయటం తప్పా, మిమ్మల్ని అడిగే చేయాలనుకొన్నాను. సమయానికి ఫోన్ కలవలేదు. అత్తగారు కూడా ఒప్పుకొన్నారంది.

తెల్లవారితే కోపం తగ్గుతుందిలే అనుకొంది. మర్నాడు ఆఫీసుకు వెళ్ళివచ్చినప్పటి నుండి శశికాంత్‌లో బాగా మార్పు వచ్చింది.

ఛీ ఛీ నలుగురిలో నా పరువుపోయింది. మా ఫ్రెండ్స్ ముందు తలదించుకోవలసి వచ్చింది. సంపాదన కోసమే నిన్ను నాట్యం చేయిస్తున్నానట. నువ్వు పాడే పాటలకి కుర్రకారంతా వెరెక్కిపోయి ఒకటే ఈలలు చప్పట్లు. నీ ఒంపు సొంపుల్ని ఒక్కొక్కళ్ళు వర్ణిస్తూ కళ్ళతోనే నీ అందాన్ని జుర్రుకొంటున్నారు.

ఇపుడు నువ్వొకరి భార్యవి. ఇష్టం వచ్చినట్లు తైతక్క లాడటం నాకు నచ్చదు. నాకు తెలియకుండా నాట్యం చేయటానికి వీల్లేదు. ఇది వాషించటం అనుకొన్నాసరే, ఆజ్ఞాపించటం అనుకొన్నా సరే!

మీరేనా ఇలా మాట్లాడేది. నాట్యాన్ని చూసి మీరిష్ట పడ్డట్టే ఎంతో మంది ఇష్టపడతారు. కళను నాలుగ్గోడల మధ్య కప్పిపెట్టడం కాదు నలుగురికీ ఆనందాన్ని కలిగిం చేదిలా ఉండాలి.క్షమించండి నేను మాత్రం. నా నాట్యాన్ని వదులుకోలేను. పెళ్ళికిముందే నా స్వేచ్ఛకు అడ్డురాకూడ దని చెప్పాను.

ఏది ఏమైనా సరే నువ్వు నాట్యం చేయటానికి వీల్లేదు. నీకు నాట్యం కావాలో? నేను కావాలో తేల్చుకో!

నాకు మీరెంత ముఖ్యమో, నాట్యంకూడా అంతే ముఖ్యం. పదిమంది ఆరాధించే కళను వదులుకోవడం నాకిష్టంలేదు.

## జాబిలీ - కలువ చెలీ

నింగిలోన వెండిమబ్బు తళతళలాడింది
నేలమీద నా మనసు మురిసిపోయింది
ఆకశాన నీలిమేఘం పరుగులు తీసింది
పురివిప్పిన నెమలిలా నా మనసు గంతులు వేసింది
సంధ్యారుణిమ కాంతులతో జగతి నిండిపోయింది
విరిసిన మల్లెపూల పరిమళాలను చిరుగాలి మోసుకువచ్చింది
సఖుడే చందమామలో చేరి చిలిపినవ్వులు రువ్వుతుంటే
చెప్పవే వెన్నెలమ్మా నేనెట్లా అతడిని చేరేది
కలలెందుకు రాతిరి నా కోసమే వెన్నెల విరబూసినపుడు
నిదురెందుకు నా సఖుడే చందమామలో కనిపించినపుడు
జగమంతా నీ నవ్వే విరిసింది అలకెందుకు నీవు రానందుకు
ఎచట చూచినా నీ రూపమే నా కనులకు తోచినది కోపమెందుకు
వెన్నెల పూలు నేలమీద జాలువారినపుడు అనుకున్నాను
ఆ పూలన్నీ మాలలుగా చేసి సఖుని మెడలో వేయాలని
వెన్నెల మడుగులో జలకాలాడినపుడు నను చూచి మైమరచి
నారేడు అలనల్లన దిగివస్తాడు నను కౌగిట బంధిస్తాడు
నింగిలోన జాబిలీ నేలమీద కలువ చెలీ
చెలిమి చేశాయి వలపు వానలో తడిశాయి

అన్నపూర్ణ

అయితే నన్నే వదులుకొంటావా! భర్తంటే గౌరవం లేదు. పదిమందిలో తైతక్కలాడే దానికి భర్త విలువేం తెలుస్తుంది. నేను చెప్పినట్లు విని ఈ నాలుగ్గోడల మధ్య పడి వుండాల్సిందే. కాదని బయటికివెళ్ళావో ఇంతటితో

## జ్వాలాదీపం

వెన్నెల వెచ్చగా తాకితే
కరిగిపోయే వెన్నముద్దే కాదు
హృదయం-!
బాధల అగ్నిగోళం బ్రద్దలైతే
అదే హృదయం
జ్వాలా జ్వలిత దీపం!!

## లోకం తీరు

బతికినంత కాలం
సూటిపోటి మాటలతో
చంపేస్తారు!
మరణించిన తర్వాత
సానుభూతి వాక్యాలలో
ముంచేస్తారు!!

## దోపిడి

పల్లెటూరు-
పచ్చగడ్డి పరకలు తిని
పవిత్రమైన పాలిస్తున్న గంగి ఆవు!
పట్టణం-
పవిత్రమైన పాలు త్రాగి
పెత్తనం చెలాయిస్తున్న పెద్దమనిషి!!

**సి. కామేశ్వరరావు**

ఈ బంధం తెగిపోతుంది అంటూ విసురుగా బయటికెళ్ళిపోయాడు.

సాయంత్రం మహిళా మండలి సభ్యులంతా వచ్చారు. వచ్చే ఆదివారం గౌతమికి సన్మానం చేయబోతున్నాం. కాదనకుండా అంగీకరించాలంటూ బలవంతం చేశారు. అదే సమయంలో శశికాంత్ ఇంటికి వచ్చాడు. వాళ్ళందరినీ చూడగానే ఆరిపోయిన మంటలు మళ్ళీ చెలరేగాయి. గౌతమి ఎక్కడికి రాదు. మీరు వెళ్ళండన్నాడు.

ఆ మాట చెప్పవలసింది నేను. నేను వెళ్ళి తీరాల్సిందే. నాలుగు గోడల మధ్య నన్ను బంధించి నా కళను ప్రోత్సహించకుండా అణగదొక్కితే సహించేది లేదు. ఈ సన్మానానికి నేను తప్పకుండా వస్తాను. మీరు వెళ్ళిరండి అంటూ వాళ్ళందరినీ పంపించివేసింది.

నువ్వు ఈ ఇంట్లో ఒక్క క్షణం కూడా వుండటానికి వీల్లేదు. నీకు నాకూ బంధం తెగిపోయింది. ఇంక నువ్వేం చెప్పినా నేను వినదలచుకోలేదు. నువ్వు నా కళ్ళ ముందు నుంచి వెళ్ళిపోయాకే నేనీ ఇంటికి వస్తానంటూ వెళ్ళాడు శశికాంత్.

అప్పటికప్పుడు సూట్‌కేస్ తీసుకొని బయటికొచ్చేసింది గౌతమి. పుట్టింటికి వెళ్ళటం ఇష్టంలేదు. ధైర్యంగా నిలబడాలనుకొన్నపుడు ఇన్ని ఆటంకాలనైనా ఎదుర్కొక తప్పదు.

కూతుర్ని చూడాలని వచ్చిన తల్లిదండ్రులకు అక్కడ గౌతమి లేదనేసరికి గుండె ఆగిపోయినంత పనయింది.

మీ ఇంటికే వచ్చిందనుకొన్నానన్నాడు శశికాంత్.

నా కూతురు ఏం తప్పు చేసి వుంటుంది. ఇంట్లోంచి బయటికి వెళ్ళవలసిన కారణం ఏమిటి. పెళ్ళి చేసి నీ చేతుల్లో పెడితే జీవితాంతం వరకు నీదే బాధ్యత. అలాంటిది ఎవరికీ చెప్పకుండా ఎందుకు వెళ్తుంది. నా కూతుర్ని ఏం చేశారో చెప్పండంటూ గొంతుచించుకొని అరిచినా లాభంలేదు.

ఎక్కడెక్కడో వెతికారు. బంధువులందరికీ ఫోన్లు చేసి కనుక్కొన్నారు. ఎక్కడా గౌతమి ఆచూకీ తెలియలేదు!

నిజంగా గౌతమి వెళ్ళిపోతుందనుకోలేదు శశికాంత్. కొంతకాలం వరకూ వెతుకుతూనే వున్నారు. గుండె రాయి చేసుకొని ఎక్కడో యాక్సిడెంట్‌లో మరణించి వుంటుందనుకొని సరిపెట్టుకొన్నారు.

కాలం సాగిపోతూ దాని పని అది చేసుకొని పోతున్నది. మనిషి కాలం వెంట పరుగులు తీస్తూనే వున్నాడు. ఎవరు వున్నా లేకపయినా జరిగేది జరుగక మానదు.

విడిపోయిన జంట కలుస్తారో లేదో తెలియదు. దేవుడు కొందరి జీవితాలతో ఆటాడుకొంటాడు. కొందరిని విడదీస్తే మరికొందరిని కలుపుతాడు. కొందరిని సుఖపెడితే మరికొందరిని కష్టపెడతాడు. విరహమూ వేదన కష్టాలన్నిటినీ కలబోసి బతకమంటాడు. మనిషికి తోడుంటే తెలియదు ఏ బాధ. ఒంటరితనం అనుభవిస్తేనేగాని ఆ బాధ అర్థంగాదు!

నటరాజ నిలయం అనే అక్షరాలు గోల్డ్‌కలర్‌లో మెరిసిపోతున్నాయి. గేటుముందు అటూఇటూ పూల

మొక్కలు స్వాగతం పలుకుతున్నాయి. ఉదయం ఎనిమిది గంటలైంది. డ్యాన్స్ నేర్చుకోవటానికి వచ్చిన కొంతమంది పిల్లలు పదిమంది వుంటారు. అంతా పదేళ్ళవయస్సువారే. నడుంకి చున్నీలు కట్టుకొని కళా భంగిమలతో నాట్యం నేర్చుకొంటున్నారు. వాళ్ళమధ్యలో పదేళ్ళ పాప తెల్లగా బొద్దుగా ముద్దుగా అందంగా వుంది. బయట గేటుముందు అరుగుమీద ఎవరో వ్యక్తి పడి వుండటం చూచి లోపలికి పరుగెత్తుకొంటూ వెళ్ళి తల్లితో చెప్పింది.

ఆమెతో బాటు పిల్లలంతా బయటికి వచ్చారు. పెరిగి పోయిన గెడ్డం, మాసిపోయిన ప్యాంటు షర్టు, అన్నం తిని వారం రోజులైనట్లుగా నీరసంతో పీక్కుపోయిన ముఖం. అతన్ని చూసిన మరుక్షణం గుండెల్లో దడ, కాళ్ళలో సన్నని వణుకు ప్రారంభమైంది. జ్వరంతో బాధ పడుతున్నట్లుగా మూలుగుతున్నాడు.

ఆ వ్యక్తిని పిల్లల సాయంతోనే లోపలికి తీసుకొచ్చి మంచంమీద పడుకోబెట్టారు. ఫ్యాను గాలికి వణికి పోతుంటే దుప్పటికప్పారు. కాఫీ కలిపి వేడిగా తాగించారు. నీరసంతో కళ్ళు మూసుకుపోతున్నాయి. కూర్చొనే ఓపిక లేక మంచం మీద వాలిపోయాడు.

ఈ పూటకి చాలు మీరంతా వెళ్ళిపోండి అంటూ పిల్లల్ని పంపించేసింది. పదేళ్ళ కూతురు భారతి భయం భయంగా చూస్తూ నిలబడింది. డాక్టర్ వచ్చి చూసి మందులు రాసిచ్చి వెళ్ళారు.

ఉదయం నుంచి సాయంత్రం వరకూ టైం ప్రకారం మందులు వేస్తుంటే తెల్లవారేసరికి జ్వర తీవ్రత కొంచెం తగ్గింది. మెల్లగా కళ్ళు తెరచి చూశాడు. పాపను చూసి నీ పేరేమిటమ్మా అన్నాడు.

భారతి అంది. మమ్మీ అంకుల్ లేచారంటూ పిలిచే సరికి లోపలనుంచి వచ్చిన తల్లిని చూడగానే అవాక్కయ్యాడు.

నోటినుంచి మాట పెగిలిరావటంలేదు. ట్యాబ్లెట్ మంచినీళ్ళగ్లాసు అందించింది.

ఏమిటలా చూస్తారు. ఎక్కడికి రావాలో అక్కడికే వచ్చారులే. మన పాప భారతి. అంటూ పరిచయం చేసింది. నేను బయటికొచ్చాక తెలిసింది. తల్లిని కాబోతున్నానని. పాప పుట్టాక నా జీవితమే మారిపోయింది.

ఏదో మాట్లాడాలని ప్రయత్నించటంతో ఆయాసం ఉక్కిరిబిక్కిరి చేసింది. పూర్తిగా విశ్రాంతి తీసుకోండి అంటూ దుప్పటి కప్పి వెళ్ళింది.

ఇన్నాళ్ళకైనా తనకో తండ్రి వున్నాడన్న సంగతి తెలియగానే భారతికి సంతోషంగా వుంది. ఎప్పుడెప్పుడు నాన్నా అని పిలుస్తానా అని తహతహలాడిపోయింది.

శశికాంత్ పూర్తిగా కోలుకోవటానికి పదిరోజులు పట్టింది. తల్లీ కూతుళ్ళు ఇద్దరూ కంటికి రెప్పలా చూశారు. నేను నీకు చేసిన ద్రోహానికి మరొకరైతే నన్ను ఇంట్లోకి రానిచ్చేవారు కాదు. నువ్వెళ్ళిపోయాక మీవాళ్ళు వచ్చారు. నన్ను నానా మాటలన్నారు. ఎక్కడెక్కడో వెతికించారు. చివరికి చనిపోయివుంటావని సరిపెట్టుకొన్నారు.

మా అమ్మా, నాన్న యాక్సిడెంటులో చని పోయారు. ఒంటరి వాడినయ్యాను. ఇంటికి వస్తే మంచి నీళ్ళు ఇచ్చేవాళ్ళు లేరు. ఆ ఒంటరితనం భరించలేక తాగుడుకు బానిసనయ్యాను. ఫ్రెండ్సంతా నా వీక్‌నెస్ గమనించి నన్ను అప్పులపాలు చేశారు. ఉన్న ఇల్లు కాస్తా అమ్మవలసి వచ్చింది.

## పోలిక

**నాన్నా**

పరాకుగా అద్దంలో చూస్తే
హఠాత్తుగా నాలో నువ్వే కనబడతావు

నా కళ్ళు
నా నవ్వు
నీవేనంటారు అందరూ

నేను నడుస్తుంటే
నాకు అనుమానం
నువ్వే నడుస్తున్నావేమో అని

## శూన్యం

ఆకాశంలో అన్ని మేఘాలూ
పగుళ్ళుబారిన నేలని
దీనంగా చూస్తూ పోయాయి

పగుళ్ళుబారిన నేల
మేఘాలు ఖాళీ అయిన ఆకాశాన్ని
అంతే దీనంగా చూస్తూ ఉంది

ముకుంద రామారావు

నువ్వెళ్ళిపోయాక ఆడతోడుకోసం మరో మనిషిని చేరదీశాను. ఆమెకోసం ఆఫీసులో అక్రమాలకు పాల్పడవలసి వచ్చింది. ఆమె కోసం అప్పులు చేసి అవి తీర్చలేక బ్యాంక్‌లో తప్పు చేసి దొరికిపోయాను. పోలీసులు, కేసులు ఉన్న ఉద్యోగం కూడా ఊడింది. చేతిలో పైసా లేక రోడ్డున పడ్డాను. చూశావుగా ఇప్పటి నా పరిస్థితి, మరో రెండు రోజులు విశ్రాంతి తీసుకొని నా దారిన నేను వెళ్ళిపోతాను. నీ దగ్గరుండే అర్హత నాకు లేదు.

మిమ్మల్ని నేను వెళ్ళిపొమ్మని చెప్పలేను. ఎంతయినా మీరు నా భర్త. అన్నీ పోగొట్టుకొన్నారు. పూర్తిగా ఆరోగ్యం పాడు చేసుకొన్నారు. ఒంటరిగా ఎక్కడని ఉండగలరు.

నాట్యం చేటం తప్పుకాదు. ఎందరో కళాకారులు కాలికి గజ్జెకట్టి ఆడితే చూసి ఆనందించేవాళ్ళు ఎంతో మంది వున్నారు. కళను నేర్చుకొన్నది నాలుగు గోడల వరకూ పరిమితం చేయకూడదు.కళాకారులకు ఎప్పుడూ పదిమంది ఆదరణ కావాలి. ఇంతకాలం నేను ఆ ఆదరణ తోనే బతకగలిగాను.

నేను బయటికి వచ్చాక అప్పటికే పాప నా కడుపులో పెరుగుతున్నది. అమ్మా, నాన్నల దగ్గరకెళ్ళి వాళ్ళను బాధపెట్టటం నాకిష్టంలేదు. ఎవరికీ తెలీకుండా మద్రాసు వెళ్ళాను. మా ఫ్రెండు వాళ్ళింట్లో ఉంటూ చిన్న చిన్న ఉద్యోగాలు చేశాను. తర్వాత పాప పుట్టింది. తక్కువ జీతంతో ఇద్దరం బతకటం కష్టం.

పాపకోసం ఆయాను ఏర్పాటు చేసి మళ్ళీ నాట్య ప్రదర్శన లివ్వటం మొదలు పెట్టాను. పాప పుట్టిన వేళా విశేషం బాగా కలిసొచ్చింది. డబ్బు సంపాదన పెరిగింది. పాప భవిష్యత్తు బాగుండా లని పదేళ్ళు కష్టపడ్డాను. ఈ మధ్యనే ఈ ఫ్లాట్ తీసుకొని చిన్నపిల్లలకు సంగీతం, నాట్యం నేర్పుతున్నాను.

పాప చాలాసార్లు అడిగింది. నాన్నా ఎక్కడ అంటూ ఏవో చెబుతూ వచ్చాను. అనుకోకుండా ఆ భగవంతుడే మిమ్మల్ని మా దగ్గరికి చేర్చాడు. మీ కభ్యంతరం లేకపోతే ఇక్కడే ఉండవచ్చు అంది గౌతమి.

జరిగిన అనుభవాలు గుణపాఠం కలిగించాలి. పోగొట్టుకొన్నవాటిని తిరిగి సంపాదించుకోలేం. చేతికందినవాటిని కోల్పోతే కవి జీవితంలా మూన్నాళ్ళ ముచ్చటే అవుతుంది.

భారతీ ఇలా రామ్మా! అంటూ కూతురిని దగ్గరికి పిలిచి తండ్రిగా వాత్సల్యాన్ని పొందాడు. తనకో నాన్న ఉన్నాడని తెలుసుకొన్న భారతి మనసు గాలిపటంలా ఎగురసాగింది.

భర్త ఎంతటి దుర్మార్గుడైనా క్షమించే గుణం ఒక్క భార్యకే ఉంటుంది. తాళికట్టించుకొన్నందుకు జీవితాంతం భర్తకు ఊడిగం చేసినా తన పాతివ్రత్యాన్ని కాపాడుకోవటం భారత స్త్రీకి ఒక వరం. అవసరం అయితే ఎదిరించి పోరాడుతుంది. కాదనుకొంటే కాలదన్ని వెళ్ళిపోతుంది. ఎక్కడెక్కడ ప్రవహించినా నది చివరికి సముద్రంలోనే కలవాలి గదా!

గౌతమికి భర్త సాన్నిధ్యం మరింత సంస్కారాన్ని తెచ్చిపెట్టింది. ఆ గూటిలో గువ్వలు మూడు నాట్యం అనే కళను ఆరాధిస్తూ ఆదరిస్తున్నాయి. ■

## శ్రీనివాస పదాలు

తెలిసి నడవనివాడు
పనిని చేయనివాడు
అవనికెప్పుడు కీడు
ఓ శ్రీనివాస!

తెలుగు భాషను చదువు
మంచివాడిగ నిలువు
తెలివి తోడను గెలువు
ఓ శ్రీనివాస!

విద్యలందునమించు
బరువులన్నియుదించు
మంచినెప్పుడు పెంచు
ఓ శ్రీనివాస!

డబ్బులేనిదిజూచి
అప్పుజేయకు చాచి
ముప్పుకలుగును లేచి
ఓ శ్రీనివాస!

వట్టిమాటలు వద్దు
హద్దుమీరను వద్దు
ముట్టజేయుము పద్దు
ఓ శ్రీనివాస!

సి.శ్రీ.